PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 282 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 06 అక్టోబర్ 2026


### ఉద్యమకారుడికి సర్పంచ్‌గా కొత్త బాధ్యత




### కాకతీయ ప్రభుత్వ కళాశాలలో రెండు రోజుల ఆప్టిట్యూడ్ & రీజనింగ్ ట్రైనింగ్ సెషన్..






# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

- సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్
- బాధితుడిగా వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- రేవంత్ రెడ్డి పిటిషన్‌పై వాడీవేడీగా విచారణ

**హైదరాబాద్, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి మిగతా2లో...

# అర్హుల ఓటు చేజారనివ్వం

- రెండు నెలల పాటు ఓటు పరిరక్షణ ఉద్యమం: పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్




## సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బోనస్

### ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున చెల్లింపు

**హైదరాబాద్, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల సందర్భంగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని ఆయన పేర్కొన్నారు.సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే మిగతా2లో...



# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

- ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
- స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
- 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ మిగతా2లో...

## మహిళలపై నేరాలను అరికట్టండి

- శిక్షలతో దుండగులకు వణుకు పుట్టాలి
- సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలి
- ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై విచారణ



**న్యూఢిల్లీ,అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీం మిగతా2లో...

# డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయండి

- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు నిర్మించండి
- అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి
- గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు డీపీఆర్ వేగవంతం చేయాలి
- కేంద్ర మంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి




## రేవంత్ సర్కార్ కుట్రలు

- వారసత్వ కట్టడాలను కూల్చేసే పన్నాగం
- బొగ్గు గని ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి
- లేకుంటే పెద్ద ఎత్తున మేం ఉద్యమిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్






## సింగరేణి కార్మికుల సమస్యలు రెండు నెలల్లో పరిష్కరించాలి

- పరిష్కరించకుంటే నిరవధిక నిరాహార దీక్ష: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** సింగరేణి కార్మికుల సమస్యలను రెండు నెలల్లోగా పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద కార్మికులతో కలిసి ఆమె నిరసన చేపట్టారు. సమస్యలకు పరిష్కారం చూపకపోతే సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.సింగరేణి కార్మికులకు సంస్థ లాభాల్లో 35 శాతం వాటా ఇవ్వాలని, వైద్య బోర్డు సమస్యలను పరిష్కరించాలని, నెలకు రెండుసార్లు వైద్య బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్మికుల పేర్లలో మిగతా2లో...

## ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటాం
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ
- ఫారమ్-6 మార్పులపై సుప్రీం వ్యాఖ్యలు
- సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలపై పిటిషన్లు..
- కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు జారీ
- వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ చేర్చాం
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టం






## వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

- ఆప్టోజెనెటిక్స్‌పై పరిశోధనలకు 2026 వైద్యశాస్త్ర నోబెల్
- కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు పురస్కారం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ ఏడాదికి నోబెల్ పురస్కారాల విజేతల ప్రకటన వైద్య శాస్త్రంతో ప్రారంభమైంది. మెదడు కార్యకలాపాలపై (ఆప్టోజెనెటిక్స్) పరిశోధకులకు వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి వరించింది. మెదడులోని నాడుల కార్యకలాపాలు ప్రారంభం లేదా నిలిపివేత సమయంలో సంభవించే అంతర్గత ప్రక్రియలపై పరిశోధనలకు అమెరికాకు చెందిన కార్ల్ డీసెరోత్ (54), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (71), జార్జ్ నాజెల్ (73) అనే శాస్త్రవేత్తలకు మిగతా2లో...

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్- స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్-స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాష్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు. మరోవైపు భారత్- స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిదని కొనియాడారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.

ఈ మేరకు సోమవారం దిల్లీలో ప్రధానమంత్రి మోదీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సమావేశమై ద్వైపాక్షిక చర్చలు చేపట్టారు. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్టం చేసేలా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష్యంగా ప్రతిష్టాత్మక ఆర్థిక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. భారత్- స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిది. ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, అధునాతన సాంకేతికత నేడు మన పునాదికి బలమైన స్తంభాలుగా ఉన్నాయి. నేటి శిఖరాగ్ర సమావేశంతో మన భాగస్వామ్యానికి కొత్త వేగాన్ని, కొత్త శిఖరాలను అందించబోతున్నాం. ఇది పెట్టుబడి, ఆవిష్కరణ, ఉద్యోగాలు, పరస్పర శ్రేయస్సు కోసం రూపొందించిన ఒక ప్రతిష్టాత్మక ప్రణాళిక. దీనితో రాబోయే 15 ఏళ్లలో భారతదేశంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి, 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సాధిస్తాం. స్విట్జర్లాండ్‌లో భారతదేశ ఎగుమతులకు మార్కెట్‌ను పెంచడానికి, రెండు దేశాల మధ్య పెట్టుబడులను మరింత సులభతరం చేయడానికి మేము అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. దీనివల్ల స్విట్జర్లాండ్‌కు భారతదేశ వ్యవసాయ, ఫార్మా, వస్త్ర, ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతి పెరుగుతుంది.

# డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయండి

**హైదరాబాద్,అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వం సహకరించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం అందించాలని ఆయన కోరారు. గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న 'చింతన్ శివిర్' --2026 కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ వెంటనే మంజూరు చేయాలని కేంద్రమంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్-65, 6ం2 లేన్ల విస్తరణ, ఆర్ఆర్ఆర్ ఉత్తర--దక్షిణ భాగాలు, హైదరాబాద్--అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే అంశాలపై చర్చించారు. హైదరాబాద్--శ్రీశైలం ఎన్‌హెచ్ -765పై ఎలివేటెడ్ కారిడార్ కోసం విజ్ఞప్తి చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మి మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్‌హెచ్ - 65లో ఎల్‌బీనగర్--మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో సహా ఆరు (6ం2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆర్‌ఈ వాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని నితిన్ గడ్కరీకి కోమటిరెడ్డి వివరించారు. మియాపూర్ --ఎల్బీనగర్ మెట్రో రైలు కారిడార్‌ను రెండో దశలో హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 2026--27 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్-నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించి నట్లు తెలిపారు. తెలంగాణ-- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం ఎన్‌హెచ్ - 65ను ఆరు(6ం2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటి రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సీఆర్ఐఎఫ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మొత్తం 511.68 కి.మి. పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ.1,227.75 కోట్ల



అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 2026--27 సీఆర్.ఐఎఫ్ పథకం కింద మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సంగారెడ్డి-నర్సాపూర్--తూప్రాన్-గజ్వేల్-జగదేవ్‌పూర్-భువనగిరి--చౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ. మేర నిర్మించనున్న త్రిబుల్ ఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యాయని, ఎన్.హెచ్.ఏఐ టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు.

# ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా జరిగితే ఎవరు చేశారు అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

# వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. 'లైట్-గేటెడ్ అయాన్ ఛానల్స్', 'ఆప్టోజెనెటిక్స్' అంశాలపై సమగ్ర పరిశోధనలు నిర్వహించిన ఈ శాస్త్రవేత్తలు జర్మనీ, అమెరికాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్నారు. 'మెదడులోని రహస్యాలను ఛేదించడానికి ఈ విధానాన్ని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధనాశాలల్లో వినియోగిస్తున్నారు" అని శాస్త్రవేత్తల కృషిని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా నోబెల్ కమిటీ కొనియాడింది. నోబెల్ కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం... డీసెరోత్ కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో, హెగెమాన్ బెర్లిన్‌లోని హంబోల్ట్ విశ్వవిద్యాలయంలో, నాజెల్ జర్మనీలోని వుర్జ్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్నారు. విజేతలు ముగ్గురితోనూ సోమవారం ఫోన్‌లో మాట్లాడినట్లు వైద్య విభాగం నోబెల్ కమిటీ కార్యదర్శి థామస్ పెర్ల్‌మాన్ తెలిపారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఈ బహుమతిని ప్రకటించడంతో నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నోబెల్ బహుమతి కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనార్లు (సుమారు 1.2 మిలియన్ డాలర్లు) అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని ముగ్గురికి మూడు సమాన భాగాలుగా పంపిణీ చేయనున్నారు. గతేడాది వైద్య శాస్త్రంలో రోగనిరోధక వ్యవస్థ పై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. మంగళవారం భౌతిక శాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్య విభాగంలో నోబెల్ విజేతల పేర్లను ప్రకటిస్తారు. శుక్రవారం శాంతి బహుమతిని ప్రకటించిన అనంతరం, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని ప్రకటిస్తారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, రాయల్ స్వీడిష్ అకాడమీ, నార్వేజియన్ కమిటీలు నోబెల్ బహుమతలను అందజేస్తాయి. ఏటా అక్టోబరు మొదటి వారంలో విజేతలను ప్రకటించి, డిసెంబరు 10 ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజున బహుమతులను ప్రధానం చేస్తారు.

# అర్హుల ఓటు చేజారనివ్వం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో అర్హులైన ఏ ఒక్కరి ఓటునూ చేజారనివ్వబోమని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఓట్లు గల్లంతైన బాధితులను ఏకం చేసి ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఉద్యమం చేపడతామని తెలిపారు. రాబోయే రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఓటు పరిరక్షణ ఉద్యమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు, ఓట్ల తొలగింపుపై సోమవారం ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ అగ్రనేతల సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి పీసీసీ స్థాయి వరకు ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రజా సంఘాలు, ఎన్జీవోలు, కుల సంఘాలకు పీసీసీ తరపున లేఖలు రాసి ఓటర్ల హక్కుల పరిరక్షణకు సహకరించాలని కోరనున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలకు కేంద్ర ఎన్నికల సంఘమే బాధ్యత వహించాలని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్ పేరుతో దాదాపు 92 లక్షల ఓట్లు తొలగించారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయి నిరసన ర్యాలీలు, 8న 'చలో రాజ్‌భవన్' కార్యక్రమం నిర్వహించను న్నట్లువెల్లడించారు. ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.

# మహిళలపై నేరాలను అరికట్టండి

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# రేవంత్ సర్కార్ కుట్రలు



**హైదరాబాద్,అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో భూములు దోచుకోవడం అయిపోయింది. ఇక భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఎక్స్ లో ఆరోపించారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని అన్నారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాల యానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే కుట్రలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బోనస్

(మొదటి పేజీ తరువాయి)

కాదని, తెలంగాణకు కొంగు బంగారంగా, లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. దేశాభివృద్ధితో పాటు తెలంగాణ అభివృద్ధిలో సింగరేణి కీలక భాగస్వామిగా కొనసాగుతోందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేందుకు సింగరేణి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కిషన్‌రెడ్డి కోరారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# సింగరేణి కార్మికుల సమస్యలు రెండు నెలల్లో పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న అలియాస్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విజిలెన్స్ కారణంగా పెండింగ్‌లో ఉన్న ఆధారిత ఉద్యోగాల కేసులను పరిష్కరించాలని, ప్రతి కార్మికుడికి సొంత ఇంటి పథకం కింద రెండు గుంటల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని, కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలని, హైపవర్ కమిటీ సిఫార్సుల మేరకు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని కవిత కోరారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో రెండు రోజుల అప్టిట్యూడ్ & రీజనింగ్ ట్రైనింగ్ సెషన్..





**హనుమకొండ, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండలోని టీఎస్‌కేసీ & ప్లేస్‌మెంట్ సెల్, టాస్క్ (Telangana Academy for Skill and Knowledge) సహకారంతో అక్టోబర్ 5 మరియు 6 తేదీలలో రెండు రోజుల అప్టిట్యూడ్ & రీజనింగ్ ట్రైనింగ్ సెషన్ను కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల్లో అనలిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్-సాల్వింగ్ ఎబిలిటీ మరియు లాజికల్ రీజనింగ్ స్కిల్స్ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఇటువంటి స్కిల్ డెవలప్‌మెం ట్ ప్రోగ్రామ్స్ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, భవిష్యత్ విద్యా,ఉద్యోగ అవకాశాలకు సిద్ధం కావాలని సూచించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ & టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డా. ఎ. అనిల్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్, హయ్యర్ ఎడ్యుకేషన్ మరియు కెరీర్ డెవలప్‌మెంట్లో అప్టిట్యూడ్ & రీజనింగ్ ప్రాముఖ్యతను వివరించారు. టీజీపీఎస్సీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్, రైల్వేస్, క్యాట్, యూపీఎస్సీ తదితర కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్‌తో పాటు వివిధ సంస్థల కార్పొరేట్




రిక్రూట్‌మెంట్ టెస్ట్లో అప్టిట్యూడ్ & రీజనింగ్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు నిరంతర సాధన ద్వారా స్పీడ్, అక్యూరసీ, లాజికల్ థింకింగ్ మరియు ప్రాబ్లమ్-సాల్వింగ్ స్కిల్స్ను పెంపొందించుకోవాలని సూచించారు.టాస్క్ సీఆర్‌టీ ట్రైనర్ రాజేష్ జన్ను విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్ మరియు కార్పొరేట్ రిక్రూట్‌మెంట్లో అప్టిట్యూడ్ & రీజనింగ్ ప్రాధాన్యతను వివరించారు. శిక్షణలో చురుకుగా పాల్గొని, అందిస్తున్న ప్రాక్టికల్ టెక్నిక్స్ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ప్రారంభ కార్యక్రమం అనంతరం రాజేష్ జన్ను అప్టిట్యూడ్ & రీజనింగ్ ట్రైనింగ్ సెషన్ను నిర్వహించారు. ప్రాబ్లమ్-సాల్వింగ్ టెక్నిక్స్, లాజికల్ థింకింగ్ మెథడ్స్, స్పీడ్ మరియు అక్యూరసీ పెంపొందించుకునే అంశాలపై శిక్షణ అందించారు. విద్యార్థులు ఈ ట్రైనింగ్ సెషన్‌లో చురుకుగా మరియు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ శ్రీనాథ్, డా. ఐ. శివనాగ శ్రీనివాస్, డాక్టర్ రమేష్చంద్ర శ్రీకాంత్, మూక్స్ కోఆర్డినేటర్, డా. జె. చిన్నా, డా. ఎం.డి. యాకూబ్, డా. ఉమ, డా. హరిప్రసాద్, సాగర్, డా. జి.కె. కుమార్, నవీన్, బాలు, వందన మరియు సునీత పాల్గొని తమ సహకారాన్ని అందించారు.విద్యార్థుల్లో అప్టిట్యూడ్, రీజనింగ్, అనలిటికల్ థింకింగ్ మరియు ప్రాబ్లమ్-సాల్వింగ్ స్కిల్స్ను పెంపొందించి, వారిని కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్, హయ్యర్ ఎడ్యుకేషన్ మరియు ఎంప్లాయ్‌మెంట్ ఆపర్చునిటీస్కు మరింత సమర్థవంతంగా సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం

# విలేకర్ల ముసుగులో ఇసుక అక్రమ రవాణా

- కూలీల ఉపాధికి గండికొడుతున్న జేసీబీల దందా!

**ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఇసుక రవాణా వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. వాగులు, నదీ పరివాహక ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ జేసీబీలతో ఇసుక తవ్వి లారీల ద్వారా పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇసుక తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఇసుకపై ఆధారపడి జీవించే కూలీలకు ఉపాధి కల్పించాల్సిన పరిస్థితుల్లో యంత్రాలతో పెద్ద మొత్తంలో ఇసుకను తవ్వి తరలించడం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటోందని కొందరు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు లారీల ద్వారా ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో వాహనాలకు అనుమతులు ఉన్నాయా నిర్ణీత పరిమితుల్లోనే రవాణా జరుగుతోందా అనే అంశాలను



అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.**విలేకరి పేరును అడ్డుపెట్టుకుంటున్నారా**ఇసుక రవాణా వ్యవహారంలో కొందరు వ్యక్తులు తమను విలేకరులుగా పరిచయం చేసుకుంటూ జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. జర్నలిస్టు గుర్తింపును అడ్డుపెట్టుకుని అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఆధారాలు లేకుండా ఎవరిపైనా ఆరోపణలు చేయకుండా అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.వాగులు, నదీ పరివాహక ప్రాంతాల్లో రాత్రివేళ జేసీబీలు, లారీలు సంచరిస్తున్నాయనే సమాచారంపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక తవ్వకాలకు, జేసీబీల వినియోగానికి, లారీల రవాణాకు అవసరమైన అనుమతులు ఉన్నాయా నిబంధనలకు అనుగుణంగానే తవ్వకాలు జరుగుతున్నాయా అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులు, వాహనాలపై చర్యలు తీసుకోవాలని, అనుమతులతోనే కార్యకలాపాలు జరుగుతున్నట్లయితే ఆ వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించి ఇసుక తవ్వకాలపై వస్తున్న ఆరోపణలకు వాస్తవాలతో తెరదించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మల్లంపల్లిలో బీజేపీలో యువకుల భారీ చేరిక

**మల్లంపల్లి, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల స్థాయి ముఖ్య సమావేశం సోమవారం మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి జినుకల కృష్ణాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణాకర్ రావు మాట్లాడుతూ రాబోయే ఉమ్మడి వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ తిరిగి పట్టభద్రుల ఓట్ల నమోదుకు కృషి చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.అనంతరం శ్రీనగర్, మాన్‌సింగ్ తండాకు చెందిన అజ్మీర తిరుపతి, ఇస్లావత్ సోమన్న, భూక్య మోహన్, అజ్మీర సంతోష్ కుమార్, మాలోత్ యాకూబ్, మాలోత్ రమేష్, బానోత్ సుమన్, మాలోత్ సంతోష్, గుగులోత్ కిరణ్ తదితర యువకులు బీజేపీలో చేరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో



చేరినట్లు వారు తెలిపారు.పార్టీలో చేరిన యువకులకు జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి జినుకల కృష్ణాకర్ రావు, మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం యువకులతో కలిసి నాయకులు జై శ్రీరామ్ నినాదాలు చేశారు.అలాగే సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మల్లంపల్లి మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దండిగా వెంకన్న, గాదాం కుమార్, కత్తి హరీష్, బొమ్మ రతి, సారన్న, మండల ఉపాధ్యక్షులు మచ్చిక రవి, గూడెల్లి కొమురెల్లి, కనుకుంట్ల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి ఎండిగా రాజు, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు మాలోత్ బాలాజీ, రేగురి రాజిరెడ్డి, రాగుల శ్రీకాంత్, గుంటుక సురేష్, బొమ్మరావేణా అజయ్, రాచర్ల వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుడికి సర్పంచ్‌గా కొత్త బాధ్యత

- విద్యార్థి దశ నుంచే తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర..

అలియాబాద్ సర్పంచ్ సనత్‌కుమార్ పటేల్‌కు ఘన సన్మానం



**పరకాల, అక్టోబర్ 05 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి దశ నుంచే చురుకుగా పాల్గొని రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుడు శాతరాశి సనత్‌కుమార్ పటేల్ అలియాబాద్ గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టడంతో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది గుడిమల్ల రవికుమార్ సనత్‌కుమార్ పటేల్ నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గుడిమల్ల రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థి దశ నుంచే సనత్‌కుమార్ పటేల్ కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. ఉద్యమంలో ప్రజల తరఫున పోరాడిన వ్యక్తి నేడు గ్రామ ప్రజల చేత సర్పంచ్‌గా ఎన్నుకోబడటం సంతోషకరమన్నారు. పదవి బాధ్యతను ప్రజాసేవకు వేదికగా మలుచుకుని అలియాబాద్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సనత్‌కుమార్ పటేల్ నాయకత్వంలో అలియాబాద్ గ్రామం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# ఖాదర్ బాబా సతీమణి ఉష రాణికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఘన నివాళులు





**సత్తుపల్లి, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్)** :సత్తుపల్లి సీనియర్ జర్నలిస్ట్ ఎస్.కె. ఖాదర్ బాబా సతీమణి జెక్కుల ఉష రాణి గుండెపోటుతో మృతి చెందారని తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్.కె. ఖాదర్ బాబా ని, వారి కుమారుడు రాహుల్ మున్నీని పరామర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఉష రాణి మృతి పట్ల సండ్ర వెంకట వీరయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు గుండె ధైర్యం, మనోధైర్యం ప్రసాదించాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో సండ్ర వెంకట వీరయ్య తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

- కలెక్టర్‌ను కలిసిన వెంకటాపూర్ జర్నలిస్టులు
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్



**ములుగు, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని వెంకటాపూర్ మండల జర్నలిస్టులు ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే వాసుదేవరావును కోరారు. ఈ మేరకు సోమవారం ములుగు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.గత కొన్నేళ్లుగా మీడియా రంగంలో కొనసాగుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నామని జర్నలిస్టులు కలెక్టర్‌కు వివరించారు. నాలుగేళ్లుగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ శివారులోని రెవెన్యూ భూమిలో గుడిసెలు వేసుకుని మోకా మీద ఉన్నామని తెలిపారు. తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జర్నలిస్టుల విజ్ఞప్తిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఇంటి స్థలాల అంశంపై పూర్తి నివేదిక అందించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జీకి కలెక్టర్ సూచించినట్లు జర్నలిస్టులు పేర్కొన్నారు.ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)కు వెంకటాపూర్ జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.కలెక్టర్‌ను కలిసిన వారిలో జర్నలిస్టులు బేతి సతీష్ యాదవ్, ఒద్దుల మురళీ, పిల్లలమర్రి శివ, గునిగంటి హరీష్, మామిడిశెట్టి ధర్మతేజ తదితరులు ఉన్నారు.

# ఎంఐఎం జిల్లా ఇన్‌చార్జి యాసర్ అర్ఫాత్‌కు కార్యకర్తల నిరసన సెగ

**• పట్టణ కమిటీని ఏకపక్షంగా ప్రకటించారంటూ సీనియర్ నాయకులు, కార్యకర్తల ఆగ్రహం**





**కరీంనగర్, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఎంఐఎం కరీంనగర్ పట్టణ కమిటీని ఏకపక్షంగా ప్రకటించారంటూ ఆ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని త్రిద హోటల్ ఎదుట నిరసన చేపట్టిన కార్యకర్తలు జిల్లా ఇన్‌చార్జి యాసర్ అర్ఫాత్, నూతన పట్టణ కమిటీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.గత 2030 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతూ సేవలందిస్తున్న తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త కమిటీని ప్రకటించడం సరికాదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో సంబంధం ఉన్న కొందరికి కొత్త పట్టణ కమిటీలో స్థానం కల్పించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న వారికి కమిటీలో చోటు కల్పించడం వల్ల పార్టీ పాత కార్యకర్తల్లో అసంతృప్తి నెలకొందని నాయకులు పేర్కొన్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పోటీ చేసిన కార్పొరేటర్లతో సంప్రదింపులు జరిపి కమిటీని ఏర్పాటు చేయాల్సిందని అన్నారు.ఏకపక్ష నిర్ణయాలు కొనసాగితే పార్టీ శ్రేణుల్లో నిరాశ, నిస్పృహలు పెరిగి సంస్థకు నష్టం జరిగే అవకాశం ఉందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

# ఎఐఎంఐఎం కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ అతీఫ్ అతీనా

**- యువ నాయకత్వానికి ప్రాధాన్యత**



**కరీంనగర్, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఆల్ ఇండియా మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్‌గా 61వ డివిజన్ కార్పొరేటర్, యువ నాయకుడు మహమ్మద్ అతీఫ్ అతీనాను నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు టౌన్ ప్రెసిడెంట్‌గా కొనసాగిన సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించినట్లు పేర్కొన్నాయి.గత మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో గులాం అహ్మద్ హుస్సేన్‌పై ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అతీఫ్ అతీనాను నూతన టౌన్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి.కరీంనగర్‌లోని త్రిధా హోటల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ కరీంనగర్ ఇన్‌చార్జి యాసర్ అర్ఫాత్, ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ ఆధ్వర్యంలో అతీఫ్ అతీనాకు నూతన బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.యువ నాయకత్వానికి ప్రాధాన్యతనిస్తూ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా కరీంనగర్‌లో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించాలని ఎఐఎంఐఎం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడంపై కొత్త నాయకత్వం దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నాయి.

# న్యాయవాదులపై దాడులు జరగడం శోచనీయం: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్




**కరీంనగర్,అక్టోబర్5(పిసిడబ్ల్యూ న్యూస్):** న్యాయవాదుల సంరక్షణ చట్టం అమల్లో ఉన్నప్పటికీ న్యాయవాదులపై దాడులు జరగడం శోచనీయమని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో న్యాయవాది బోదాసు రమేష్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం కరీంనగర్ జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపైనే దాడులు జరిగితే ప్రజలకు న్యాయం ఎలా అందుతుందో సమాజం ఆలోచించాలన్నారు.దాడికి పాల్పడిన వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రమేష్‌పై నమోదైన కౌంటర్ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు సీనియర్ న్యాయవాదులు కోరారు.ఈ నిరసనలో సంయుక్త కార్యదర్శి సుంకె దేవకిషన్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి బెజ్జంకి శ్రీకాంత్, ఈసీ సభ్యులు చెల్లోజు భూమాచారి, ఏ. రాములు, చౌడమల్ల వీరస్వామి, బి. శంకర్, మహేందర్, బి. శ్రీకాంత్, శ్రీనివాస్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలి

**• ఓట్ల చోరీ ఆరోపణలపై ఇండియా కూటమి నిరసనకు పిలుపు**



**కరీంనగర్, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల సంఘం పనితీరుపై ఆరోపణలు, ఓటర్ల జాబితాలో అవకతవకలకు నిరసనగా సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో భారీ నిరసన నిర్వహించనున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కూటమి భాగస్వామ్య పక్షాల సంయుక్త సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా గతంలో విశ్వసనీయతను కాపాడుకుందని, ప్రస్తుతం దాని పనితీరుపై పలు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని పేర్కొన్నారు.ఏఐసీసీ పిలుపు మేరకు రాహుల్‌గాంధీ చేపడుతున్న పోరాటానికి మద్దతుగా కరీంనగర్‌లో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, తెలంగాణ జన సమితి, సమాజ్‌వాదీ పార్టీ తదితర కూటమి పక్షాలు పాల్గొంటాయని చెప్పారు.రేపు ఉదయం 10:30 గంటలకు ఇందిరాగాంధీ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు భారీ మార్చ్ నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు మేడిపల్లి సత్యం తెలిపారు. సమావేశంలో కూటమి నాయకులు పంజాల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, తేజదీప్‌రెడ్డి, జిన్నం ప్రసాద్, అంజన్‌కుమార్, సత్తు మల్లేశం, మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళితుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కాకా వెంకటస్వామి

**చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం**




**కరీంనగర్, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** మాజీ ఎంపీ, మాజీ సీడబ్ల్యూసీ సభ్యుడు, దళిత ఉద్యమ నేత స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలను కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పేద దళిత కుటుంబంలో జన్మించిన వెంకటస్వామి పార్లమెంట్ సభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా దేశ, రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. పేదలు, ఇల్లు లేని వారికి గుడిసెలు ఏర్పాటు చేయడంలో ముందుండి పనిచేయడంతో 'గుడిసెల వెంకటస్వామి'గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.డా. బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యాసంస్థలను స్థాపించి వేలాది మంది విద్యార్థులకు విద్యను అందించారని తెలిపారు. ఆయన సేవల ఫలితంగా అనేక మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు.వెంకటస్వామి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన క్రమశిక్షణ, పట్టుదలను ఆదర్శంగా తీసుకోవాలని మేడిపల్లి సత్యం సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం రెడ్‌క్రాస్‌లో కెఎస్‌ఎఫ్ ప్యానెల్ జయభేరి

**15 స్థానాల్లోనూ ఖమ్మం సర్వీస్ ఫ్రంట్ అభ్యర్థుల విజయం..**

**584 ఓట్లతో డా. కూరపాటి ప్రదీప్ కుమార్ అగ్రస్థానం**



**ఖమ్మం,ప్రతినిధి అక్టోబర్ 5 పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఖమ్మం సర్వీస్ ఫ్రంట్ (ఖూఫీ) ప్యానెల్ విజయదుందుభి మోగించింది. ఆదివారం ఖమ్మంలోని ఇల్లందు క్రాస్ రోడ్‌లోని టిటిడిసి భవన్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఎన్నికల్లో కెఎస్‌ఎఫ్ ప్యానెల్‌కు చెందిన మొత్తం 15 మంది అభ్యర్థులు అత్యధిక ఓట్లతో విజయం సాధించారు. దీంతో వారంతా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.ఈ ఎన్నికల్లో మొత్తం 39 మంది అభ్యర్థులు పోటీ చేయగా, డా. కూరపాటి ప్రదీప్ కుమార్ 584 ఓట్లు సాధించి అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థిగా అగ్రస్థానంలో నిలిచారు. కెఎస్‌ఎఫ్ ప్యానెల్‌కు సభ్యులు విశేష మద్దతు పలకడంతో మొత్తం 15 మంది అభ్యర్థులు విజయం సాధించడం విశేషంగా నిలిచింది.విజయం అనంతరం నూతనంగా ఎన్నికైన మేనేజింగ్ కమిటీ సభ్యులు తమపై నమ్మకంతో ఓటు వేసి విజయాన్ని అందించిన ప్రతి రెడ్‌క్రాస్ సభ్యునికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయాన్ని వ్యక్తిగత విజయంగా కాకుండా ప్రజాసేవ, మానవతా విలువలు, రెడ్‌క్రాస్ సేవా స్ఫూర్తిపై సభ్యులు ఉంచిన విశ్వాసానికి ప్రతీకగా భావిస్తున్నామని పేర్కొన్నారు.కొత్తగా ఎన్నికైన మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. ఆపదలో ఉన్నవారు, పేదలు, అనాథలు, రక్తం అవసరమైన వారు, సమాజంలోని అన్ని వర్గాలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.




# ప్రజావాణికి వినతులు

**• సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**

**కల్లూరు, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు.ప్రజల నుంచి వచ్చిన వినతులను సబ్ కలెక్టర్ స్వీకరించి, ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. సమస్యల వివరాలను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిపై సత్వరమే చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు.ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమం వేదికగా ఉపయోగించుకోవాలని, అందిన ప్రతి వినతిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుడూర్ గ్రామ అక్షర యూత్ నూతన కమిటీ ఎన్నిక



**కమలాపూర్ అక్టోబర్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని గుడూర్ గ్రామానికి చెందిన అక్షర యూత్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా బూడిద శివకృష్ణ, ఉపాధ్యక్షులుగా బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పర్ల పెల్లి పు న్నం చందర్ కోశాధికారిగా బండి కుమారస్వామి,సహాయ కార్యదర్శిగా మార్త విష్ణు, యూత్ సలహాదారులుగా బండి కుమారస్వామి (మేస్త్రి),బూడిద రమేష్,బండి నాగరాజు,బండి వినయ్ సాగర్,బండి సురేష్, కార్యవర్గ సభ్యులుగా మంచాల దేవేందర్,నాంపల్లి రాజు, బూడిద రాణేష్,బండి హరీష్, బండి నాగరాజు,బూడిద రాకేష్, మంచాల రాకేష్,బండి శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచడం ప్రభుత్వ బాధ్యత

**• పాఠశాల బలపడితేనే సమాజం బలపడుతుంది**



**జవహర్‌నగర్, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** విద్య కేవలం ఉద్యోగం సంపాదించడానికి ఉపయోగపడే సాధనం కాదని, వ్యక్తి ఆలోచనా విధానం, కుటుంబ భవిష్యత్తు, సమాజ ప్రగతి, దేశ దిశను నిర్ణయించే శక్తివంతమైన సాధనమని సామాజిక కార్యకర్త మహమ్మద్ రషీద్ పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపడం వంటి పరిణామాలపై సమాజం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ఉపాధ్యాయులను లేదా ప్రభుత్వాన్ని మాత్రమే బాధ్యులను చేయకుండా విద్యా ప్రమాణాలు, పాఠశాల నిర్వహణ, మౌలిక వసతులు, పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు, తల్లిదండ్రులతో సంబంధాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.విద్యా ప్రమాణం అంటే పాఠ్యపుస్తకాలు పూర్తి చేయడం మాత్రమే కాదని, విద్యార్థులు చదవడం, రాయడం, గణితం చేయడం, ప్రశ్నించడం, సమస్యలను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను సాధించడమే నిజమైన విద్యా ఫలితమని తెలిపారు. ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో ఎంతో మంది అంకితభావంతో పనిచేస్తున్నారని, అదే సమయంలో ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. సమయపాలన, నాణ్యమైన బోధన, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ, తల్లిదండ్రులతో నిరంతర సంబంధాలు విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.పాఠశాలల పర్యవేక్షణ కేవలం రిజిస్టర్లు, హాజరు పట్టికల పరిశీలనకు పరిమితం కాకూడదని, విద్యార్థులు నిజంగా నేర్చుకుంటున్నారా బోధన ఎలా జరుగుతోంది వెనుకబడిన విద్యార్థులకు సహాయం అందుతోందా వంటి అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు.ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, క్రీడా సదుపాయాలు, డిజిటల్ వసతులు కల్పించడంతో పాటు ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాల ఆధారంగా పాఠశాలల పనితీరును అంచనా వేయాలని అన్నారు.తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలకు పంపించడం మాత్రమే కాకుండా వారు ఏం నేర్చుకుంటున్నారో తెలుసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, యువత, విద్యావంతులు భాగస్వాములు కావాలని కోరారు.ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం అంటే ప్రైవేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా వ్యవహరించడం కాదని, ప్రతి కుటుంబంలోని పిల్లవాడికి సమానమైన నాణ్యమైన విద్య అందేలా చూడటమే లక్ష్యమని మహమ్మద్ రషీద్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల బలపడితేనే పేద పిల్లల భవిష్యత్తు, సామాజిక న్యాయం, సమాజ ప్రగతి బలపడతాయని పేర్కొన్నారు. "ప్రభుత్వ పాఠశాల మన పాఠశాల.. పిల్లల భవిష్యత్తు మన బాధ్యత. విద్య బలపడితేనే సమాజం ముందుకు సాగుతుంది" అని ఆయన అన్నారు.

# బైక్ టాక్సీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**• 400 మందితో 'బైక్ టాక్సీ సంక్షేమ సంఘం' ఆవిర్భావం**



**కరీంనగర్, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ర్యాపిడో, ఊబర్, ఓలా వంటి రైడ్ షేరింగ్ సంస్థల్లో పనిచేస్తున్న బైక్ టాక్సీ రైడర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సుమారు 400 మంది రైడర్లు కరీంనగర్‌లో ఏకమయ్యారు. ఈ సందర్భంగా 'బైక్ టాక్సీ సంక్షేమ సంఘం'ను ఏర్పాటు చేసుకున్నారు.సొంత బైక్, సొంత పెట్రోల్ ఖర్చులతో రైడ్లు చేస్తున్న తమకు ప్రస్తుతం లభిస్తున్న చార్జీలు గిట్టుబాటు కావడం లేదని రైడర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల కమిషన్లు, పన్నులు, పెట్రోల్, బైక్ నిర్వహణ ఖర్చులు పోగా ఆదాయం మిగలడం లేదని తెలిపారు. ప్రస్తుతం కిలోమీటర్‌కు రూ. 5రూ. 6 మాత్రమే లభిస్తోందని, కనీసం రూ. 10 చెల్లించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రైడర్లపై భారం పడుతున్న సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను తగ్గించాలని, రాత్రింబవళ్లు సేవలందిస్తున్న బైక్ టాక్సీ రైడర్లకు తగిన గుర్తింపు, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. వాహనాల నిర్వహణకు తరచూ వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు.కంపెనీలు తమ సమస్యలపై వెంటనే స్పందించి న్యాయమైన చార్జీలు అమలు చేయాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే బైక్ టాక్సీ సేవలను నిలిపివేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# గ్రామ కమిటీలు బలోపేతం కావాలి



**మల్లంపల్లి, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** గ్రామ కమిటీలు బలోపేతం అయితేనే ప్రజాపాలన మరింత పటిష్టంగా ముందుకు సాగుతుందని మల్లంపల్లి మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కుసుమ స్మిత అన్నారు. మల్లంపల్లి మండలంలో ఆమె ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఎన్నికలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కుసుమ స్మిత మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేసి, ప్రతి అర్హుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను పటిష్టం చేసి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంపై చర్చించారు. గ్రామ కమిటీ ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలని నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పొనుగోటి రవీందర్, వార్డు సభ్యులు జింక వేణు, దయ్యాల కవిత, హర్షం కీర్తి, మహిళా నాయకులు జింక హైమ, మేకల సురేఖ, ముప్పిడి జ్యోతి, ముప్పిడి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలు నివారించి.. అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలి

**- ప్రజల కన్నీళ్లు తుడిచే సంక్షేమ పాలనకు కార్యాచరణ ప్రకటించాలి**

**- ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్**

**- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య**






**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యుత్ కోతలను తక్షణమే నివారించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేసి సామాజిక భద్రత కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసనలో జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య మాట్లాడుతూ.. ప్రజల జీవనంతో ముడిపడిన సమస్యలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విద్యుత్ కోతలతో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగునీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలపై పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నాయని పేర్కొన్నారు.వృద్ధాప్యంలో ఆసరాగా నిలవాల్సిన పెన్షన్ కోసం వృద్ధులు, వైకల్యంతో జీవిస్తున్న వారు, వితంతువులు, తలసేమియా బాధితులు, అనాథలు ఎదురుచూస్తున్నారని అన్నారు. సంక్షేమం కేవలం హామీల్లో కాకుండా అర్హుల ఇంటి గడపకు చేరినప్పుడే ప్రజా ప్రభుత్వం అనే నమ్మకం బలపడుతుందని పేర్కొన్నారు. అర్హులందరినీ గుర్తించి పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబ బడ్జెట్లు తలకిందులవుతున్నాయని, తక్కువ ఆదాయంతో జీవించే పేద, మధ్యతరగతి కుటుంబాలు రోజువారీ అవసరాలు తీర్చుకోవడానికే నానా అవస్థలు పడుతున్నాయని తెలిపారు. పొయ్యి వెలిగించేందుకు సరిపడని ఆదాయం.. పెరుగుతున్న ధరలతో నిండుతున్న మార్కెట్.. భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న కుటుంబాలు వంటి పరిస్థితులకు ముగింపు పలకాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విద్యుత్ సవరణ చట్టం నేపథ్యంలో వినియోగదారులపై అదనపు భారాలు పడకుండా చూడాలని, విద్యుత్ మీటర్ల విషయంలో ప్రజలపై బలవంతపు చర్యలు చేపట్టరాదని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపడం కంటే వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధానాలను అమలు చేయాలని కోరారు.ప్రజల అవసరాలే పాలనకు ప్రాధాన్యతగా, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని పుల్లయ్య అన్నారు. విద్యుత్, పెన్షన్లు, ధరల నియంత్రణ వంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణ కార్యాచరణ ప్రకటించి ప్రజలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీజకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, జి. రామయ్య, బందెల వెంకయ్య, ఆవుల అశోక్, జిల్లా నాయకులు సిహెచ్. శిరోమణి, ఎస్.కె. లాల్‌మియా, తిమ్మిడి హనుమంతరావు, టీ. ఝాన్సీ, పి. శోభ, కే. శ్రీనివాస్, సోమనపల్లి వెంకటేశ్వర్లు, రెంటాల యాదగిరి, బానోత్ శంకర్, గుడుచుట్లా మాధవరావు, గోగుల సోములు, సత్తార్ మియా, పరికపల్లి మధు, బొమ్మకంటి రమేష్, కొత్తపల్లి చిన్నశివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కృషితో విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు

**• మహమ్మద్ గౌస్‌పల్లి పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ**

**• విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి: సర్పంచ్ పసుల కార్తీక్**



**మల్లంపల్లి అక్టోబర్ 05( పి సి డబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలం మహమ్మద్ గౌస్‌పల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ పసుల కార్తీక్ యూనిఫామ్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి అభ్యున్నతికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ,విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీతో పాఠశాలల్లో సమానత్వ భావన పెంపొందడంతో పాటు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 7 దరఖాస్తులు

**• 22 శాఖల అధికారుల హాజరు**



**కల్లూరు, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్)** :మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 22 శాఖల అధికారులు హాజరయ్యారని స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో డి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి మొత్తం ఏడు దరఖాస్తులు అందాయి అని అన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అధికారులకు తమ వినతులను సమర్పించారు.అందిన దరఖాస్తుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయి. రెవెన్యూ శాఖకు ఐదు దరఖాస్తులు అందగా, పీడీ హౌసింగ్, ఖమ్మం వారికి ఒక దరఖాస్తు, కల్లూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు మరో దరఖాస్తు అందింది. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు.ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా వారి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ బంతిరాం, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు చోరీ ర్యాలీ నిరసన కార్యక్రమానికి తరలి వెళ్లిన కమలాపూర్ కాంగ్రెస్ నాయకులు





**కమలాపూర్ అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్ వరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఓటు చోరీ అక్రమాలకు పాల్పడుతున్న సి ఈ సి జ్ఞానేష్ కుమార్ ను వెంటనే విధుల నుంచి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు సారథ్యంలో కమలాపూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ అనుబంధ సంఘ సభ్యులు మహిళలు కాంగ్రెస్ అభిమానులు భారీ సంఖ్యలో హనుమకొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఓటు చోరీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

# ప్రజావాణిలో 16 దరఖాస్తులు... ఇందిరమ్మ ఇళ్లకు అత్యధికం



**కమలాపూర్ అక్టోబర్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు తమ ఇబ్బందులను సమస్యల పైన దరఖాస్తులు సమర్పించారు.కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.మొత్తం 16 దరఖాస్తులు రాగా ఇందిరమ్మ ఇళ్లకు 7 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో పేర్కొన్నారు.మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలు పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కోరారు.

# గ్రామ అభివృద్ధిపై పట్టింపేది..?

- మంజూరు అయినా పనులు పూర్తి చేయాలి
- వెంకటేశ్వరపల్లి గ్రామ సర్పంచ్ మహేందర్ రెడ్డి



**నడికూడ, అక్టోబర్ 5,పిసిడబ్ల్యూ న్యూస్ :**నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ మహేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో గత ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో ఎం.ఆర్ ఆర్ గ్రాంట్ నుండి ఒక కోటి 50 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగిందని,వెంకటేశ్వర్లపల్లి గ్రామం నుండి నరసింగాపూర్ వరకు గత సంవత్సరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శిలాఫలకం వేశారని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు ముందుకు సాగడం లేదని గ్రామ సర్పంచ్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు . గ్రామ అభివృధి కోసం గ్రామ పరిధిలో వాగు నుండి గ్రామానికి, గ్రామం నుండి మర్రిపల్లిగూడెం వరకు గ్రామ ప్రజల సహకారంతో 6 కిలోమీటర్లు గ్రావెల్ రోడ్డు పోయించడం జరిగిందని అన్నారు. మంజురైనా పనులు కూడా చేసే దిక్కు లేదని గ్రామాన్ని పట్టించుకునే నాథుడే లేరా అని సర్పంచ్ వాపోయారు.ఇప్పటికైనా నాయకులు పట్టించుకోని గ్రామాన్ని అభివృద్ధి చేయాలనీ గ్రామ ప్రజలకు తరుపున సర్పంచ్ మహేందర్ రెడ్డి కోరారు..

# అక్రమ నిర్మాణం తొలగించిన అధికారులు



**నడికూడ, అక్టోబర్ 5, పిసిడబ్ల్యూ న్యూస్ :**నడికూడ మండల కేంద్రంలో ని సమీపంలో ఉన్న గుట్ట పై సర్వే నెంబర్ 525 లో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని రెవిన్యూ అధికారులు సోమవారం తొలగించారు.అక్కడ చర్చి కి సంబందించిన గోడ నిర్మాణం చేపడుతుండగా వారికి నోటీసులు జారీ చేసినట్టు నడికూడ తహసీల్దార్ రాణి తెలిపారు. వారు స్పందించకపోవడంతో అధికారులు ఆ యొక్క నిర్మాణాన్ని తొలగించినట్టు తెలిపారు.ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఎవరూ కట్టడాలు చేపట్టినా తొలగించడం జరుగుతుంది అని తహసీల్దార్ రాణి తెలిపారు.అయితే మండల శివారు లోని 525 సర్వే నెంబర్ లో మత పరమైన నిర్మాణాలు ఉన్నాయని వాటిని తొలగించాలని తగిన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు రెండు నెలల క్రితం అధికారులను కోరగా సోమవారం రెవిన్యూ అధికారులు చర్యలు చేపట్టి కేవలం ఒకటే నిర్మాణం తొలగించారని మిగతా అక్రమ నిర్మాణాలను కూడ తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో "పరీక్షల శిక్షణ కేంద్రం" ప్రారంభం




**కరీంనగర్, అక్టోబర్ 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలోనీ శాతవాహన విశ్వవిద్యాలయంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని "పరీక్షల శిక్షణ కేంద్రం" (సెంటర్ ఫర్ కంపిటిటివ్ ఎగ్జామ్స్) ను ఈరోజు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ లైబ్రరీ ఆడిటోరియంలో కో-ఆర్డినేటర్ గా డాక్టర్ ఎన్. వి. శ్రీరంగా ప్రసాద్ తో కలిసి ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించి మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ మార్గదర్శకత్వం అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమని, అన్ని రకాల సౌకర్యాలతో ఈ సెంటర్ ని ఏర్పాటు చేస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు.విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ పెద్దపెల్లి గారు పాల్గొని విద్యార్థులకు ప్రత్యేకమైన అవకాశాలు కల్పించి ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లాలంటే మంచి అకాడమిక్ వాతావరణం కావాలని దీనికోసం మంచి నిపుణులను తీసుకువచ్చి తరగతులు నిర్వహిస్తామని వారి శిక్షణలో విద్యార్థులు క్రమశిక్షణతో అంకితభావంతో వీటిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథులుగా డాక్టర్ డి. హరికాంత్ విసి ఓఎస్డీ, ప్రొఫెసర్ కె. పద్మావతి ప్రిన్సిపాల్, ఆర్ట్స్, సోషల్ సైన్సెస్ అండ్ లా కళాశాల, డాక్టర్ ఎస్. రమాకాంత్ ప్రిన్సిపాల్, సైన్స్ కళాశాల, ఈ సెంటర్ కో కో-ఆర్డినేటర్లు గా డాక్టర్ డి. విజయప్రకాష్ ఇంగ్లీష్ విభాగం, డాక్టర్ డి. విజయ్ కుమార్ కెమిస్ట్రీ విభాగం పాల్గొని ఈ శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలలో విజయం సాధించేందుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు, సరైన దిశానిర్దేశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.కలిసి ఘనంగా ప్రారంభించారు.

# ప్రజావాణికి 145 దరఖాస్తులు

- అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**కరీంనగర్, అక్టోబర్ 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** పాత కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 145 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.**ఇక నుండి కొత్త కలెక్టరేట్ లో "ప్రజావాణి "** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వచ్చే వారం నుండి నూతన కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం నుండి నూతన కలెక్టరేట్ సమావేశ మందిరం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని, ప్రజావాణి కార్యక్రమం అక్కడే నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఖమ్మం క్రీడా కిరణాలు

- 256 మందిలో ప్రతిభ చాటిన 43 మంది ఎంపిక
- చిన్నారుల ప్రతిభకు క్రీడా ప్రోత్సాహం





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తిని పెంపొందించి, గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఖమ్మం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు మందుల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో అండర్-10, అండర్-12, అండర్-14 సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఖమ్మం జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు తెలిపారు.జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు బాలబాలికలు కలిపి 256 మంది ఉత్సాహంగా హాజరయ్యారు. చిన్నారుల కళ్లలో మెరిసిన విజయం సాధించాలనే తపన, పరుగులో గెలవాలనే పట్టుదల, తమ ప్రతిభను నిరూపించుకోవాలనే ఆత్మవిశ్వాసం ఎంపిక పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 43 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఖమ్మం జిల్లా జట్టుగా ఎంపిక చేశారు. అక్టోబర్ 11న కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఈ జట్టు పాల్గొననుంది. క్రీడల్లో గెలుపోటముల కంటే చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించడం ముఖ్యమని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ ఎం.డి. గౌస్ మాట్లాడుతూ.. నేటి చిన్నారులే రేపటి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలనే లక్ష్యంతో వారికి అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. ఎంపికైన క్రీడాకారులు తమ తల్లి, తండ్రి, సంరక్షకులతో కలిసి కోచ్ ఎం.డి. హాలీం (సెల్: 75692 11736) వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. ఈ ఎంపిక కార్యక్రమంలో తెలంగాణ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ ఎం.డి. గౌస్ తో పాటు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కోశాధికారి యం. సుధాకర్, సంఘ సభ్యులు సిహెచ్. కృష్ణయ్య, నక్క వెంకటేశ్వర్లు, డి. రవికుమార్, ఎం.డి. హాలీం, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు. చిన్న అడుగులతో మొదలైన ఈ క్రీడా ప్రయాణం... రేపటి విజయాల వైపు పరుగులు తీయాలని, ఖమ్మం జిల్లా క్రీడా ప్రతిభ రాష్ట్రస్థాయిలో వెలుగొందాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు ఆకాంక్షించారు.



# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**కరీంనగర్, అక్టోబర్ 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా మేనేజింగ్ కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నికల ద్వారా పూర్తి శాస్త్రీయ పద్ధతిలో ఎంపికైంది. డిప్యూటీ కోఆపరేటివ్ ఆఫీసర్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గంలో చీఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్గా పెండ్యాల కేశవరెడ్డి చైర్మన్గా సంగెం లక్ష్మణరావు, వైస్ చైర్మన్గా రాధాకృష్ణారెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్గా కుందారపు మహేశ్వర్, కోశాధికారిగా గోనె శ్రీనివాస్, ఎన్నికయ్యారు.అదేవిధంగా డైరెక్టర్లుగా రాగి శ్రీనివాస్, రాజిరెడ్డి, కాన్పర్తి మనోహర్ రావు, యూత్ కోఆర్డినేటర్గా మొగలోజు రాకేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా కరీంనగర్ జిల్లాలో మానవతా సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు, రక్తదానం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్య సేవలు, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.సమాజంలోని ప్రతి వర్గానికి రెడ్ క్రాస్ సేవలు మరింత చేరువయ్యేలా సమన్వయంతో పనిచేస్తామని, సంస్థ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని పేర్కొన్నారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎడ్ల అరవింద్ రెడ్డి రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మీందర్ సింగ్ పట్టణ సంఘం అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్ నాయకులు సత్యనారాయణ అస్గర్ అలీ అజయ్ కుమార్ రాజశేఖర్ రెడ్డి జాడ కమలాకర్ రగోతం రెడ్డి పలువురు రెడ్ క్రాస్ సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ బద్రేశ్ లయన్ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.



Indian Red Cross Society, Karimnagar District

Notice to the Members of the Managing Committee Members

Present: Sri S. Ramanujacharya,
M.A., B. Ed, L.L.B, HDCM,
Joint Registrar/District Coop. Officer &
Election Officer, IRCS, Karimnagar Dist.

Rc. No. 01/2026-Elections, Dated 04.10.2026

Sub: Elections—Indian Red Cross Society, Karimnagar—Election of Office bearers of the IRCS, Karimnagar—Convening meeting of Managing Committee members — Notice Issued-Regarding.

Ref: Elections held on 04.10.2026 to the members of the Managing committee of the Indian Red Cross Society, Karimnagar District.

<<>>

Whereas, for election of the Office bearers of the Indian Red Cross Society, Karimnagar District, a meeting of the elected Managing Committee members is proposed to be convened on 05.10.2026 at 11.00 A.M in the seat of the society.

Therefore, all the Managing Committee members are requested to attend the meeting on Scheduled date, time and place.

In case of failure to attend on time the matter shall be reported and the election of Office Bearers shall not be done as per schedule.

Election Officer,
IRCS, Karimnagar.

| | | |
|---|---|---|
| 01. | MOGULOJU RAKESH | Elected Member. |
| 02. | Er. KOLA ANNA REDDY | Elected Member. |
| 03. | P. VIDYASAGAR | Elected Member. |
| 04. | CH. SURESH | Elected Member. |
| 05. | P. SRIHARI REDDY | Elected Member. |
| 06. | KUNDARAPU MAHESHWAR | Elected Member. |
| 07. | RAGI SRINIVAS | Elected Member. |
| 08. | SAINENI NARENDER | Elected Member. |
| 09. | GONE SRINIVAS | Elected Member. |
| 10. | HANMANDLA RAJIREDDY | Elected Member. |
| 11. | KANAPARTHI MANOHAR RAO | Elected Member. |
| 12. | SANGEM LAXMAN RAO | Elected Member. |
| 13. | PENDYALA KESHAVA REDDY | Elected Member. |
| 14. | V. RADHAKRISHNA REDDY | Elected Member. |
| 15. | A. MUNINDHER PRESIDENT | Elected Member. |

# పేదల కోసం రాజకీయాలు ప్రజాసేవగా మారాలి



- కాకా ఆశయాల సాధనకు యువత రాజకీయాల్లోకి రావాలి: దామాల సత్యం

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పేదల కోసం రాజకీయాలు ప్రజాసేవగా మారాలని, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన కాకా వెంకటస్వామి ఆశయాలను సాకారం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దామాల సత్యం అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలంటే యువత నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని పిలుపునిచ్చారు.కాకా వెంకటస్వామి 73వ జయంతి సందర్భంగా సోమవారం ఖమ్మం నగరంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కాకా చిత్రపటానికి నాయకులు, యువజన విభాగం సభ్యులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దామాల సత్యం మాట్లాడుతూ పేదల కోసం రాజకీయాలను ప్రజాసేవగా మలిచిన నాయకుడిగా కాకా వెంకటస్వామి సేవలను గుర్తుచేశారు.పేద కుటుంబాల్లో పుట్టిన యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై పనిచేయాలని కోరారు. విద్య, ఉపాధి, వైద్యం, గృహ వసతి, సామాజిక భద్రత వంటి మౌలిక అంశాలపై ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల రాజకీయ సాధికారత కోసం పార్టీ పనిచేస్తోందని తెలిపారు.కాకా చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని దామాల సత్యం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు తెల్లపుట్ట, జగపతిబాబు, టౌన్ అధ్యక్షుడు కొప్పుల రామారావు, మేడి పాండు, వరదయ్య, చింత నారాయణగౌడ్, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

# రాజకీయాలను దిగజారుస్తున్న బజారు భాష

**• ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే ఆస్తుల ఆరోపణలు: తమ్మినేని వీరభద్రం**




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యు న్యూస్) :** రాష్ట్రంలో అధికార, విపక్ష నేతలు ఉపయోగిస్తున్న బజారు భాష రాజకీయాలను దిగజారుస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం అన్నారు. రాజకీయ విమర్శలు గౌరవప్రదమైన భాషలోనే ఉండాలని సూచించారు. సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ద ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు భూ ఆక్రమణలు, ఆస్తుల వ్యవహారాలపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని తమ్మినేని ఆరోపించారు. హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని, విపక్షాలు కూడా ప్రకటనలకు పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై కార్యాచరణ చేపట్టాలని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్ర క్రమంగా తగ్గుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల వ్యవస్థ, ఎన్నికల సంఘం పనితీరుపై ప్రజల్లో అనుమానాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వామపక్షాలు, ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాలు చేపడతామని తెలిపారు. వామపక్షాల ఐక్యతకు ఐక్య కార్యాచరణ అవసరమని, ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాల ద్వారా ఐక్యత సాధ్యమవుతుందని తమ్మినేని పేర్కొన్నారు. ప్రజలను కదిలించడం ద్వారా ప్రజా ఉద్యమాలను నిర్మించడమే సీపీఎం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఇంట్లో చొరబడి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు చోరీ..



**రామడుగు, అక్టోబర్ 05 (పి.సి.డబ్ల్యు న్యూస్):** రామడుగు మండల కేంద్రంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించిన ఘటన సోమవారం వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. ఇంట్లో పరిశీలించగా వస్తువులు చిందరవందరగా ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలను సేకరించి పరిశీలించారు. సుమారు రెండున్నర తులాల బంగారం, 36 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కె. రాజు తెలిపారు.

# వస్త్రాభిమానులకు సరికొత్త షాపింగ్ గమ్యంగా 'శ్రీ వారాహి లక్ష్మి సిల్క్స్'

**• నేహా శెట్టి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం**





**హనుమకొండ, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యు న్యూస్):** వరంగల్‌లో వస్త్రాభిమానులకు మరో సరికొత్త షాపింగ్ గమ్యం అందుబాటులోకి వచ్చింది. 'శ్రీ వారాహి లక్ష్మి సిల్క్స్'ను ప్రముఖ నటి నేహా శెట్టి సోమవారం ఘనంగా ప్రారంభించారు. పండుగలు, వివాహాలు, శుభకార్యాలకు అనుగుణంగా వివిధ రకాల వస్త్రాలను ఒకే చోట అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని వినియోగదారులకు ప్రత్యేక రాయితీలు అందిస్తున్నట్లు సంస్థ యజమానులు కాసంపూర్ణ చందర్, గుండా శ్రీకాంత్, అల్లాడి నవనీత్ తెలిపారు. రూ.99 నుంచి రూ.లక్ష వరకు వివిధ ధరల్లో చీరలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పట్టు చీరలతో పాటు పంజాబీ డ్రెస్‌లు, మహిళల దుస్తులు తదితర విభిన్న రకాల వస్త్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ అందుబాటు ధరల్లో వస్త్రాలను అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఈవీ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, యువజన నాయకుడు తోట పవన్ పాల్గొన్నారు.

# ఆర్టీసి ఎన్నికల్లో ఈయు కూటమిని గెలిపించండి



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యు న్యూస్) :** ఆర్టిసి ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ, ఏఐటియుసి నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, టీఎంయు (థామస్ రెడ్డి) యూనియన్లకు చెందిన రాష్ట్ర నాయకులు ఖమ్మం డిపోలో ప్రచారం నిర్వహించారు. ఖమ్మం రీజియన్లో ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎంయు, టిఎంయు కూటమికి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని కార్మికుల డిమాండ్లు నెరవేరాలంటే ఖమ్మం రీజియన్లో ఎన్ఎంయు కాగడ గుర్తుకు, రాష్ట్ర గుర్తింపుకు సంబంధించి బస్సు గుర్తుకు ఓటేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆర్టిసి కార్మికులను మోసం చేసిన అశ్వద్ధామరెడ్డి మరోసారి మోసం చేసేందుకు సిద్దమయ్యారని ఆ మోసాలను కార్మికులు తిప్పికొట్టాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాబు, తెలంగాణ మద్దూర్ యూనియన్ నాయకులు థామస్ రెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎండి మౌలానా, ఏఐటియుసి, సిపిఐ నాయకులు ఎస్ కె జానిమియా, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, శింగు నర్సింహారావు, గాదె లక్ష్మీనారాయణ, ఏనుగు గాంధీ, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాటి అప్పారావు, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మగౌరవానికి కంచ ఐలయ్య కృషి

**74వ జన్మదినం సందర్భంగా ఘన నివాళి**




**జవహర్‌నగర్, అక్టోబర్ 5 (పీసీడబ్ల్యు న్యూస్):** అణచివేతకు గురైన ఉత్పత్తి కులాల ఆత్మగౌరవం, హక్కుల కోసం తన రచనలు, ఆలోచనల ద్వారా నిరంతరం కృషి చేస్తున్న సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెఫర్డ్ 74వ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా పాపయ్యపేటలో కురుమ గొల్ల కుటుంబంలో జన్మించిన కంచ ఐలయ్య గ్రామీణ నేపథ్యం నుంచి ఉన్నత విద్యను అభ్యసించి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్ర ఆచార్యుడిగా సేవలందించారు. బహుజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులపై ఆయన తన రచనలు, ప్రసంగాల ద్వారా విస్తృతంగా చర్చకు తెచ్చారు. గౌతమ బుద్ధుడు, జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనల ప్రభావంతో శ్రమజీవులు, ఉత్పత్తి కులాల పాత్రను ఆయన తన రచనల్లో వివరించారు. Why I Am Not a Hindu, God as Political Philosopher, Buffalo Nationalism, Post`Hindu India వంటి రచనలు కుల వ్యవస్థ, సామాజిక అసమానత లపై చర్చకు దారితీశాయి.

బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సమాన విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇంగ్లిష్ మాధ్యమ విద్య అవసరమని ఆయన చాలాకాలంగా వాదిస్తున్నారు. శ్రమకు గౌరవం, శాస్త్రీయ దృక్పథం, సామాజిక సమానత్వం కోసం ఆయన చేస్తున్న కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.

# డ్వాక్రా మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలి..

**• కొత్తూరు(సి)ఉపసర్పంచ్ పగడాల క్రిష్ణా రెడ్డి**



**కురవి. అక్టోబర్ 05(పిసిడబ్లా న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు (సి) గ్రామంలో గ్రామైఖ్య సంఘం భవన నిర్మాణానికి గ్రామ ఉపసర్పంచ్ పగడాల క్రిష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ సహకారంతో కొత్తూరు(సి) గ్రామానికి రెండు వీఓ భవనాలు మంజూరయ్యాయని తెలిపారు. డ్వాక్రా మహిళలు ఈ భవనాలను సద్వినియోగం చేసుకుని సంఘాలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఏపీఎం దుర్గాప్రసాద్,పంచాయతీ కార్యదర్శి దారోజి శ్రీనివాస్.సీసీ సులోచన, సీఏ నాయిని సంధ్య,గ్రామ సర్పంచ్ భర్త బాదావతు సిరి నాయక్.గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వేణు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి మేఘన, గ్రామ ఉపాధ్యక్షులు బచ్చలకూర మల్సూరు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చిప్పరపల్లి వెంకన్న, కొంపెల్లి పూలమ్మ, వార్డు సభ్యులు కొంపెల్లి మల్లయ్య గౌడ్, సీనియర్ నాయకులు గోరేపాటి గుర్వయ్య, యువజన నాయకులు చిప్పరపల్లి ఎల్లయ్య, అన్నెపర్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**కరీంనగర్, అక్టోబర్ 05 (పిసిడబ్ల్యు న్యూస్):** కరీంనగర్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా మేనేజింగ్ కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నికల ద్వారా పూర్తి శాస్త్రీయ పద్ధతిలో ఎంపికైంది. డిప్యూటీ కోఆపరేటివ్ ఆఫీసర్ గారి సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో చీఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా పెండ్యాల కేశవరెడ్డి చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు, వైస్ చైర్మన్‌గా రాధాకృష్ణారెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్‌గా కుందారపు మహేశ్వర్, కోశాధికారిగా గోనె శ్రీనివాస్, ఎన్నికయ్యారు. అదేవిధంగా డైరెక్టర్లుగా రాగి శ్రీనివాస్, రాజిరెడ్డి, కాన్పర్తి మనోహర్ రావు, యూత్ కోఆర్డినేటర్‌గా మొగలోజు రాకేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా కరీంనగర్ జిల్లాలో మానవతా సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు, రక్తదానం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్య సేవలు, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి రెడ్ క్రాస్ సేవలు మరింత చేరువయ్యేలా సమన్వయంతో పనిచేస్తామని, సంస్థ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎడ్ల అరవింద్ రెడ్డి రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మీందర్ సింగ్ పట్టణ సంఘం అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్ నాయకులు సత్యనారాయణ అస్గర్ అలీ అజయ్ కుమార్ రాజశేఖర్ రెడ్డి జాడ కమలాకర్ రగో తం రెడ్డి పలువురు రెడ్ క్రాస్ సభ్యులు, ఉద్యోగ సం ఘాల నాయకులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ బద్రేశ్ లయన్ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

## మెగా క్రేజీ అప్‌డేట్.. చిరంజీవి 'కాకా'లో

# కీలకపాత్రలో అనురాగ్ కశ్యప్

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'కాకా'లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఈ సినిమాలో బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఓ అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చేరికతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. తాజాగా అనురాగ్ కశ్యప్ కూడా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఆయనతో పాటు ఇతర ప్రధాన నటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. విలక్షణమైన, పవర్‌ఫుల్ పాత్రలకు పెట్టింది పేరైన అనురాగ్ కశ్యప్, మెగాస్టార్ చిరంజీవి మధ్య తెరపై వచ్చే ముఖాముఖి సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు అంచనా వేస్తున్నారు. "ది వరల్డ్ ఆఫ్ కాకా జస్ట్ గాట్ డెడ్లియర్" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన ఈ అంచనాలకు మరింత బలం చేకూర్చింది.'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న 'కాకా' సినిమాపై మొదటి నుంచే భారీ ఆసక్తి నెలకొని ఉంది. ఇప్పటికే చిరంజీవి పుట్టినరోజున విడుదలైన 'కాకా' టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇప్పుడు అనురాగ్ కశ్యప్ చేరికతో ఈ ప్రాజెక్ట్ మరింత క్రేజీగా మారింది. ఈ చిత్రంలో అనశ్వర రాజన్ కూడా నటిస్తుండగా, మరికొందరు ప్రముఖ నటీనటులు కూడా భాగం కానున్నారు.కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు.




# స్వీయదర్శకత్వంలో కిరణ్ అబ్బవరం 'రియాలిటీ'..



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం దర్శకుడిగా మారారు. తన తదుపరి చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. కొంతకాలంగా ఖా13 అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాకు 'రియాలిటీ' అనే ఆసక్తికరమైన పేరును ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం టైటిల్ గ్లింప్స్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది.

విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమా థీమ్‌ను తెలియజేస్తోంది. "చిన్న చిన్న ఆనందాలే... హై మూమెంట్స్" అనే ట్యాగ్‌లైన్‌తో పాటు "మన కథ. మన రియాలిటీ" అనే క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే సహజమైన కథతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది.

జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం సరసన దేవికా భట్ హీరోయిన్‌గా నటిస్తోంది. శరత్ కుమార్, సాయికుమార్, రమేశ్ ఇందిర, అన్నపూర్ణమ్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. తనదైన శైలిలో యూత్‌ఫుల్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లతో గుర్తింపు తెచ్చుకున్న కిరణ్ అబ్బవరం, 'రియాలిటీ'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. క్రిస్మస్ విడుదలను లక్ష్యంగా పెట్టుకుని చిత్ర బృందం ముందుకు సాగుతోంది.



# ఆ దాడులకు నాకు సంబంధం లేదు..

## ఐటీ సోదాలపై రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్!

తన పేరును ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ సోదాలతో ముడిపెడుతూ వస్తున్న వార్తలపై బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఆ సోదాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు, ఆన్‌లైన్ రిపోర్టర్లు వార్తలను సంచలనం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు."కొందరు ఆన్‌లైన్ రిపోర్టర్లు, కొన్ని ప్రధాన మీడియా సంస్థల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలను సంచలనం చేసే ధోరణి పెరుగుతుండటం బాధాకరం. అందుకే ఒకేసారి అందరికీ స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఆ సోదాలు నాకు సంబంధించినవి కావు" అని రకుల్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

తన నేపథ్యం గురించి వివరిస్తూ.. "నేను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చాను. ఇండస్ట్రీలో నాకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరు. కేవలం నా కష్టంతోనే ఈ స్థాయికి వచ్చాను. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నాను" అని ఆమె తెలిపారు.ఆర్థిక అవకతవకల ఆరోపణలను కూడా ఆమె ఖండించారు. "వ్యక్తిగతంగా గానీ, ఏ నిర్మాణ సంస్థ తరపున గానీ నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీలలో పాలుపంచుకోలేదు. దేశంలో లేదా విదేశాల్లో ఎవరి పేరు మీద కూడా నేను బినామీ ఆస్తులు కలిగి లేను. నాకు ఎవరూ ఎప్పుడూ ఎలాంటి ఆస్తులను బహుమతిగా ఇవ్వలేదు. అలాంటి ఖరీదైన బహుమతులు తీసుకోకూడదన్నది నా నియమం" అని రకుల్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మీడియా తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "నా గురించి తప్పుడు, దురుద్దేశపూర్వక కథనాలు ప్రచురించిన వారందరూ వాటిని వెనక్కి తీసుకుని, వాస్తవాలను స్పష్టం చేయాలని కోరుతున్నాను. మీడియా వ్యాపారంలో ఎంత పెద్ద సంస్థకైనా ఆర్థిక ఒత్తిళ్లు ఉంటాయని నేను అర్థం చేసుకోగలను. కానీ అది వాస్తవాలను పణంగా పెట్టి జరగకూడదు. ఒకరి ప్రతిష్ఠ, జీవనోపాధిని దెబ్బతీసేలా అసలే ఉండకూడదు" అని ఆమె హితవు పలికారు.కాగా, ముంబైలో నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాషు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ముంబై ఐటీ విభాగం సుమారు 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ఫైనాన్సింగ్ పేరుతో నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తనపై వచ్చిన వార్తలను రకుల్ ఖండించారు.

# డీప్‌ఫేక్ అకౌంట్లపై 'మా' సీరియస్..

## వివరాలు సేకరిస్తున్నామన్న మంచు విష్ణు




తెలుగు చిత్ర పరిశ్రమను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్ వీడియోలు, నెగెటివిటీని వ్యాప్తి చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలు, నెట్‌వర్క్‌ల వివరాలను సేకరిస్తున్నామని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు వెల్లడించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమస్యపై శాశ్వత పరిష్కారం కోసం పరిశ్రమలోని కీలక విభాగాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఇటీవల వెలుగులోకి వచ్చిన ఏఐ డీప్‌ఫేక్ వీడియో ఘటనపై మంచు విష్ణు స్పందిస్తూ, దీనిని ఒకరిద్దరికి సంబంధించిన సమస్యగా కాకుండా, మొత్తం పరిశ్రమకు ఇది ఒక హెచ్చరికగా భావించాలని అన్నారు. హీరో రామ్ పోతినేని వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "వారికి ముఖం లేదు, అందుకే భయం లేదు" అని, ఇలాంటి వారిని కట్టడి చేయాలంటే ఆన్‌లైన్ ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానించే అంశంపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. దీని ద్వారా ఆన్‌లైన్‌లో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన సూచించారు.కొందరు నటుల ఫొటోలతో ఫ్యాన్ పేజీల రూపంలో నకిలీ ఖాతాలు సృష్టించి, వాటి ద్వారా ద్వేషాన్ని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని విష్ణు విమర్శించారు. ఈ నెగెటివిటీలో కొంత పరిశ్రమలోపలి నుంచే వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఖాతాలు, వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై 'మా' పూర్తి సమాచారాన్ని సేకరిస్తోందని, తగిన ఆధారాలతో చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు.డీప్‌ఫేక్‌లు, సైబర్‌బుల్లీయింగ్, సినిమాలపై ఉద్దేశపూర్వకంగా చేసే నెగెటివ్ ప్రచారాలను ఎదుర్కోవడానికి ఒక పటిష్టమైన, శాశ్వత వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని విష్ణు నొక్కిచెప్పారు. దీనికోసం తెలుగు ఫిలిం ఛాంబర్, నిర్మాతల మండలి, 'మా' ప్రతినిధులు తక్షణమే సమావేశం కావాలని ఆయన కోరారు. ఒక సినిమాపై విమర్శలు రావడం సహజమేనని, కానీ సినిమా విడుదలకు ముందే దానిని దెబ్బతీసే ఉద్దేశంతో వ్యవస్థీకృతంగా దాడి చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

# అఖండ-3 ఉంటుంది..

## నెలాఖరులోగా గుడ్‌న్యూస్: బోయపాటి

నందమూరి బాలకృష్ణ, మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన ప్రతి సినిమా సూపర్ హిట్ అయ్యాయి. రీసెంట్‌గా వీరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా 'అఖండ-2'. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. అయితే తాజాగా బోయపాటి శ్రీను అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పారు. 'అఖండ-3' కచ్చితంగా ఉంటుందని ఆయన అన్నారు. సోమవారం విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. నెలాఖరిలోగా తన కొత్త ప్రాజెక్టును ప్రకటిస్తానని తెలిపారు.



## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' అక్టోబరు 9న రావడంలేదు..

# కారణం ఏంటో చెప్పిన నాగవంశీ

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఆకస్మిక పరిణామంతో వెంకటేశ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



సినిమా వాయిదాకు గల కారణాలను నిర్మాత నాగవంశీ స్పష్టంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ.. "సినిమాకు సంబంధించిన తుది దశ పనులు ఇంకా పూర్తి కాలేదు. మరో రెండు, మూడు పాటల చిత్రీకరణతో పాటు, కొన్ని కీలక సన్నివేశాల షూటింగ్ కూడా మిగిలి ఉంది. వీటికి తోడు ప్రచార కార్యక్రమాలను కూడా ప్రారంభించాల్సి ఉంది. ఈ పనులన్నీ పూర్తి చేయడానికి కనీసం రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది.. సోషల్ మీడియాలో ఎవరూ వేలెత్తి చూపకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు.నిర్ణయించిన తేదీకే విడుదల చేయాలనే తొందరలో నాణ్యతతో రాజీ పడలేమని నాగవంశీ పేర్కొన్నారు. "ప్రేక్షకులతో పాటు మేం కూడా థియేటర్‌లో సినిమా ఫైనల్ కాపీ చూడటం మాకు ఇష్టం లేదు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న కాపీనే థియేటర్లకు అందిస్తాం. సినిమా నాణ్యతకే మా మొదటి ప్రాధాన్యత. అందుకే పూర్తి సంతృప్తిగా అన్ని పనులు ముగించుకుని, కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం" అని ఆయన వివరించారు.

ప్రస్తుతం చిత్ర బృందం మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. అయితే పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి, భారీ అంచనాలతో ఎదురుచూస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడక తప్పదు.